


# తోడు

**- డాక్టర్ ఎమ్.సుగుణరావు**

## చుట్టూ పిల్లలు. ఒకళ్ళో, ఇద్దరో కాదు వందలకొద్దీ ఎత్తుకోమని చేతులు చాస్తూ, "అమ్మా...అమ్మా..." అనే కేకలు.

**ఒక్కసారి కళ్ళు తెరిచి చూసింది సుజాత. తను బెడ్‌రూములో ఉంది. చుట్టూ పిల్లల బొమ్మలు. ఎదురుగా కేలండర్‌లో బోసి నవ్వుల పాపాయి.**

'తను కన్నది కల!'అనే విషయం ఆమెకు స్ఫురణకు రాగానే మనసులో దిగులు మేఘం.

ఇంతలో ఎవరో వస్తున్న చప్పుడు. భర్త అని పోల్చుకుంది.

"ఏంటీ... ఇంకా నిద్రపోతున్నావా...? మనం వెళదామనుకున్నాం కదా అక్కడికి..." అన్నాడు నవ్వుతూ.

"నైట్ డ్యూటీకదా... మెలకువ రాలేదు.. అప్పుడే ఐదయిందా... పావుగంటలో బయలుదేరదాం"అంటూ బాత్‌రూములోకి నడిచింది.

పావుగంట తర్వాత తయారై, కాఫీ కలిపి డ్రాయింగ్ రూములోకి వచ్చింది. మెడికల్ జర్నల్ చదువుతున్న శశాంక్‌కి కాఫీ కప్పు అందించింది. తనూ తాగుతూ భర్త వంక క్రీగంటితో చూసింది. తమని చూసి "మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంటారందరూ!" ఎన్ని కలలు కన్నారు, బీచ్ ఒడ్డున ఇసుకలో ఎన్ని మేడలు కట్టారు. చివరకు మిగిలిందేమిటి? ఆమెలో మళ్ళీ నిర్లిప్తత.

ఆలోచనల్లో ఉండగానే భర్త మెట్లు దిగి కారులో కూర్చోవడం గమనించలేదు. వేగంగా ముందుకు నడిచింది. ఆమె కారులో కూర్చోగానే కారు ముందుకు కదిలింది.

అరగంట తర్వాత కారు ఆ ఆవరణలో ప్రవేశించింది. బాగా పెరిగిన పూల మొక్కలతో ఆ ఆవరణ పచ్చగా కనిపిస్తోంది. ఆ మొక్కల మధ్య పర్ణశాలల్లా చిన్న చిన్న ఇళ్ళు, చుట్టూ ప్రహరీగోడ.

"నేను కారు పార్క్‌చేసి వస్తాను... నువ్ ఆఫీసులో కూర్చో" అన్నాడు శశాంక. స్వీట్ పాకెట్లు, పళ్ళు వుంచిన సంచీ తీసుకుని కారు దిగింది.

ఆమెని చూసి పిల్లలంతా బైటకు వచ్చారు. తెల్లటి చీరలో వున్న ముసలావిడకు తను తెచ్చినవి అందిస్తూ "పిల్లలకు పంచండి" అంటూ ముందుకు నడుస్తోంది. ఈసారి ఆమె పిల్లల ముఖాల్లో దైన్యాన్ని చూడదలుచుకోలేదు.

ఇంతకుముందు రెండుసార్లు ఆ అనాధాశ్రమానికి వచ్చింది. ఆ ఆశ్రమ నిర్వాహకులు పిల్లల్ని వరసలో నిలబెట్టారు. ఐదేళ్ళనుంచి పదేళ్ళలోపు వయసు పిల్లలు తమవంక ఆశగా చూస్తూ నిలబడ్డారు. తన కళ్ళు ఆత్రంగా వెతికేయి. తనవి గానీ, శశాంకవి గానీ పోలికలు, ఎవరి ముఖంలోనయినా కనిపిస్తాయేమోనని తన వెర్రిగానీ, తమలాంటి వాళ్ళుంటారా?!

ఇంతలో భర్త వచ్చి, "ఎంతవరకూ వచ్చింది నీ వేట?!" అన్నాడు. అతడి మాటలకు ఆమె సమాధానం చెప్పకుండా మౌనంగా ఊరుకుంది. "అయినా నీ చాదస్తంగానీ, మనం పెంచుకోబోయే పిల్లలు మన లాగే ఉంటే మన పిల్లలనుకుంటారనా నీ భ్రమ. పెళ్ళయ్యి ఐదేళ్ళయినా మనకు పిల్లలు పుట్టడంలేదని అందరికీ తెలిసిన సంగతే... ఇంతకాలం లేనిది, ఎదిగిన పిల్లల్ని మన పిల్లలని ఎలా అనుకుంటారు?" అన్నాడు విసుగ్గా.

భర్త మాటలకు తలొంచుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు.

"ఛ... ఛ... ఆ మాత్రం దానికే ఏడుస్తావా? ఆరోగ్యంగా ఉన్న వాళ్ళని ఎవర్నైనా చూడు, ఐదేళ్ళ లోపయితే మంచిది" అన్నాడు.

"ఆరోగ్యంగా ఉన్నవాళ్ళా?" ఆమె కళ్ళు తుడుచుకుంటూ అంది. "మరి...? ఈ ఆశ్రమంలో మొత్తం డబ్భైమంది పిల్లలున్నారు. వారంరోజుల క్రితమే మన లేబ్ అసిస్టెంట్‌ని పంపించి అందరి బ్లడ్ శాంపిల్స్ పరీక్ష చేయించాను. ఎవరికీ ఏ సమస్యా లేదు. చాలామందికి మాల్ న్యూట్రిషన్. కొంచెం బలమైన ఆహారం ఇస్తే చాలు. అయితే ముగ్గురికి మాత్రం కాంజెనిటల్ సమస్యలున్నాయి. బుద్ధి సరిగ్గా పెరగలేని వాళ్ళు. అలాంటి వారితో సమస్యే కదా. ఇద్దరం డాక్టర్లం, మన పెంచుకోబోయే పిల్లల గురించి కావలసిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం..." అన్నాడు.

అతడి మాటలు శ్రద్ధగా విన్న ఆమెకు తన కన్సల్టింగ్ రూములోని మదర్ థెరిసా ఫొటో గుర్తుకొచ్చింది. ఆవిడ పెంచుకున్న అమ్మాయితో దిగిన ఫొటో. ఆ పిల్లకు కాళ్ళు, చేతులు లేవు. ఏదో ఇంటర్వ్యూలో మదర్ థెరిసాను ఎవరో అడిగారట. పూర్తిగా అంగవైకల్యం ఉన్న పిల్లను పెంచుతున్నారేమిటి? అని. అందుకు ఆమె ఏమంది? డాక్టరు అవసరం రోగికే కాని... ఆరోగ్యవంతుడికి కాదుకదా! మరిపుడు తాము ఆరోగ్యంగా ఉన్నవాళ్ళను వెతుకుతున్నాం. పాపం అనారోగ్యంగా ఉన్న పిల్లల పరిస్థితి ఏమిటి?

"ఏమిటీ ఆలోచిస్తున్నావ్?" అన్న భర్త మాటలతో తలెత్తి "వెళ్ళిపోదాం. నా మనసేమీ బాగోలేదు" అంది.

"సరే... నీ ఇష్టం.. ఇది మూడోసారి రావడం... నువ్వే ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నావ్!" అంటూ కారు వైపు నడిచాడు.

కారెక్కుతున్న సుజాత "ఆంటీ!" అన్న పిలుపుతో వెనక్కి తిరిగింది. టాటా చెపుతున్న కుర్రాడు. అతడి చేతిలో తాను పంచిన స్వీట్లు. ఆ అబ్బాయి వెనక ఆశగా చూస్తున్న పిల్లలు. వారివైపు చూడటం ఇష్టం లేక కారెక్కేసింది. అయినా ఆ జాలికళ్ళ చూపులు ఆమెను వెంటాడుతూనే వున్నాయి.

❖ ❖ ❖

వారం తర్వాత స్నేహితురాలి పెళ్ళికోసం మద్రాసు వెళ్ళి తిరిగొచ్చింది సుజాత.

ఆ రోజు కొంచెం ఆలస్యంగా డ్యూటీకి వచ్చి "ఓ పి' చూస్తోంది.

ఇంతలో గబగబా వచ్చిన నర్స్ వెంకటలక్ష్మి- "అమ్మా ఏక్సిడెంట్ల వార్డులో పేషంటు వళ్ళు కాలిపోతోంది. మాత్రలు వేసినా తగ్గడం లేదు. వారం రోజులుగా ఎవరూ చూడడం లేదమ్మా..." అంది.

"వారంరోజులుగా ఎవరూ చూడడంలేదా?" అంది సుజాత ఆశ్చర్యంగా.

తల అడ్డంగా ఊపింది వెంకటలక్ష్మి.

"డ్యూటీ డాక్టరు మనోహరిగారు బాగా చూస్తారు కదా" అంది సుజాత.

"ఆవిడే కాదమ్మా... గైనకాలజిస్టు పద్మగారు, ఇంకా మీకు ముందు 'ఓపి' చూసిన పార్వతిగారు, ఎవరూ ఆ పేషంటు దగ్గరకే వెళ్ళడంలేదు... నేను క్రొత్తగా ట్రెయినింగ్ అయి వచ్చినదాన్ని. నాకేం తెలుస్తుందమ్మా..." అంది.

సుజాత ఆలోచనలో పడింది. ఎందుకు ఆ పేషంటుకు అంతా దూరంగా వుంటున్నారు? అనుకుంది. తలెత్తి వెంకటలక్ష్మి వంక చూసింది. ఆమె ముఖంలో ఆందోళన. తనలాగే నర్స్ వెంకటలక్ష్మి ఏ పేషంటుకు సీరియస్ అయినా బాధపడుతుంది.

ఆలోచిస్తూనే ఆ పేషంటు ఫైల్లోని రిపోర్టులు చూస్తోంది. గర్భిణీ, డ్రౌనింగ్ కేసు. సమయానికి నీటిలో

దూకి ఆ అమ్మాయిని రక్షించారు. ఇద్దరు ప్రాణులు బతికారు. తనతోపాటూ పాపం ఇంకా లోకం చూడని ఆ జీవిని ఎందుకు చంపాలనుకుందో? ఒక రిపోర్టు చూసేసరికి ఆమెకు షాక్‌గా అనిపించింది. ఆ పేషంటుకు హెచ్ఐవి టెస్ట్ పాజిటివ్!

'మైగాడ్... అందుకే అందరూ దూరంగా ఉంటున్నారు. పైగా అన్నీ తెలిసిన డాక్టర్లూ ఆమెకు ట్రీట్‌మెంటు చెయ్యకుండా వదిలెయ్యడమా? అలా అనుకుంటూనే వేగంగా ఆ పేషంటు వున్న బెడ్ వైపు నడిచింది. ఇంజక్షన్లు, టాబ్లెట్లు. పన్నెండు గంటల తర్వాత ఆ పేషంటు మామూలు స్థితికి వచ్చింది.

❁ ❁ ❁

రెండురోజుల తర్వాత ఆ పేషంటును తన కన్సల్టింగ్ రూముకు పిలిపించుకుంది సుజాత. మెల్లగా వివరాలు తెలుసుకుంది. ఆమె పేరు గంగ. ఆమెది ఆ టౌనుకు దగ్గరలోని పల్లెటూరు. తమ ఊరినుంచి లారీలతో ఇసుక తోలే లారీ డ్రైవరుతో ప్రేమలో పడింది. అది పెద్దవాళ్ళకు ఇష్టంలేకపోవడంతో అతడితో వచ్చేసింది. గుళ్ళో పెళ్ళి. పట్నంలో కాపురం, సంవత్సరంపాటు హాయిగా గడిచింది. ఆ తర్వాత అతడి ఆరోగ్యం క్షీణించింది. ఆస్పత్రికి వెళితే తెలిసింది అతడికి ఎయిడ్స్ అని. ఆ తర్వాత ఆమెకూ ఆ వ్యాధి సంక్రమించింది. చుట్టూవున్న మనుషుల సూటిపోటి మాటలు. లోకానికి భయపడ్డారు, తమను చులకన చేస్తున్న వారి ముందు తలెత్తుకోలేకపోయారు. వారి మనసులు పూర్తిగా చచ్చిపోయాయి. ఇక బతుకెందుకు? అనుకున్నారు. ఇద్దరూ కలిసి గోదాట్లోకి దూకారు. అతడు మాత్రం గల్లంతు. శరీరం దొరకలేదు. ఆమెను ఎవరో చేపలు పట్టేజాలరులు రక్షించారు.

అలా ప్రేమించిన మనిషితో పట్నం వచ్చిన ఆమె బతుకులో విషాదం మిగిలింది.

తానూ భర్తతోపాటూ, చనిపోయినా బాగుండేదని ఆమె సుజాత ముందు గుండెలవిసేలా ఏడ్చింది.

సుజాత, ఆమెను చూసి జాలిపడింది. అటు పెంచిన తల్లితండ్రుల ఆదరణకూ నోచుకోలేదు. ప్రేమించిన మనిషే దక్కలేదు.

ఇక పుట్టబోయే బిడ్డ బ్రతకడం అనుమానమే... కారణం తల్లీ, తండ్రి హెచ్ఐవి బాధితులయితే భూమ్మీదకు రాని ఆ బిడ్డకు ఆ వ్యాధి వచ్చే అవకాశం నలభై శాతంవరకూ వుంది అనేది వైద్య రంగం ధృవీకరించిన విషయం.

సుజాత ఆలోచనలో పడింది. ఆ బిడ్డను ఎయిడ్స్ బారినుంచి రక్షించాలి, అందుకు తను శక్తివంచన లేకుండా ప్రయత్నించాలి... భర్తను పోగొట్టుకున్న గంగకు పుట్టబోయే బిడ్డే తోడు... అలా ఆమెలో దృఢ సంకల్పం ఊపిరిపోసుకుంది. కారణం మామూలు కాన్పు కాకుండా సిజేరియన్ ఆపరేషన్ ద్వారా బిడ్డకు ఎయిడ్స్ రాకుండా నివారించవచ్చును. తల్లి పాలు తాగకుండా జాగ్రత్తపడితే ఎయిడ్స్ వచ్చే అవకాశాలు తక్కువ. ఇవి మెడికల్ సైన్సు ధృవీకరించినవి. ఆ దిశలో తను ముందుకు సాగాలనుకుంది సుజాత.

❁ ❁ ❁

వారం తర్వాత నిద్రపోతున్న సుజాతకు మెలకువ వచ్చింది. పక్క గదిలో అత్తగారు మాట్లాడుతున్న మాటలు.

"నువ్ మా మాట విని, రెండో పెళ్ళికి సిద్ధపడు. అంతకన్నా గత్యంతరం లేదు..." అత్తగారు గట్టిగానే అంది.

"వద్దమ్మా... నేనాపని చెయ్యలేను...!" భర్త మెల్లగా అంటున్న మాటలు.

"లేదు... నువ్ చెయ్యాలి. ఈ ముసలి వయసులో మమ్మల్ని హింసపెట్టకు. ఒక్కగానొక్క కొడుకువి, నీకు ఏ సంతూ లేకపోతే మన వంశం పరిస్థితి ఏమిటి? ఆ పిల్లకు ఎలాగూ పిల్లలు పుట్టే పరిస్థితి లేదంటున్నావ్. నీకేమయ్యింది? చక్కని పిల్లను తీసుకొచ్చి పెళ్ళిచేస్తా".

మావయ్యగారు ప్రాధేయపడుతూ అంటున్న మాటలు. వారి మాటలకు సుజాత గుండె ఆగినట్టయ్యింది.

"తను ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నాడనుకుంటున్న' అను భర్త ఏం చేస్తాడు? తల్లి మాటలు విని మళ్ళీ పెళ్ళికి సిద్ధపడతాడా! భగవాన్ ఏమిటీ పరీక్ష..."

పుట్టబోయే బిడ్డ బ్రతకడం అనుమానమే... కారణం తల్లీ, తండ్రి హెచ్ఐవి బాధితులయితే భూమ్మీదకు రాని ఆ బిడ్డకు ఆ వ్యాధి వచ్చే అవకాశం నలభై శాతంవరకూ వుంది అనేది వైద్య రంగం ధృవీకరించిన విషయం.

సుజాత శరీరం అంతా చెమటతో తడిసింది. కళ్ళనించి నీళ్ళు.

ఇక ఆమెకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

❁ ❁ ❁

రెండు రోజులవరకూ సుజాతతో మాట్లాడేందుకు వచ్చి వెళ్ళిపోయేవాడు శశాంక.

భర్త తనతో రెండో పెళ్ళి గురించి అడగడానికి సందేహిస్తున్నట్టుగా ఆమెకు అర్థమయింది.

ఆరోజు సాయంత్రం "సుజీ నీతో మాట్లాడాలి, అలా వెళ్ళొద్దాం..." అన్నాడు.

"బీచ్ వరకూ దేనికి? ఇక్కడే చెప్పండి. వారసుడి కోసం మీ అమ్మగారు పెళ్ళిచేసుకోమంటున్నారు? అంతేనా" అందామె.

"నీకెలా తెల్సు...!" అన్నాడు ఆశ్చర్యంగా.

సుజాత మాట్లాడకుండా తన రూములోకి వెళ్ళి తలుపులు వేసుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

రెండురోజుల వరకూ ఇద్దరికీ మాటల్లేవు. మూడో రోజు మళ్ళీ అత్తగారూ, మావగారూ వచ్చారు. భర్తతో చర్చలు జరుపుతున్నారు. తనతో ఏమీ మాట్లాడలేదు.

వారిని చూసి జాలేసింది సుజాతకు. కొడుక్కి పిల్లలు లేరనే బాధతో వారిలో ముసలితనం మరీ పెరిగినట్టనిపించింది సుజాతకు. ఇద్దరూ ఆమె గదిలోకి వచ్చి రెండుచేతులూ జోడించారు.

"తప్పు... మీరు పెద్దవారు..." అంటూ వారిని వారించింది.

"అమ్మా... మమ్మల్ని క్షమించు. వేరేదారి లేదు. మీకు పిల్లలు పుట్టలేదనే దిగులే మమ్మల్ని చంపేస్తోంది. దానికి నువ్వే కారణం అని డాక్టరుగా నీకూ తెలుసు. నువ్ ఒప్పుకుంటేనే గాని వాడు పెళ్ళిచేసుకునేటట్టు లేదు" అన్నారిద్దరూ ఆమె చేతులు పట్టుకుని.

సుజాత ఆలోచనలో పడింది. క్షణాలు, నిమిషాలు, గంటలు. సాయంత్రం వరకూ ఆ ఆలోచనలు తెగలేదు. దుఃఖంతో గొంతు పూడ్చుకుపోయింది.

'తన భర్తను వేరే వ్యక్తితో పంచుకోవడమా! ఎన్ని కలలు? ఎన్ని ఆశలు! తామిద్దరూ ఒకరికోసం ఒకరు పుట్టామని మురిసిపోయింది. నాతి చరామి అంటూ తనతో ఏడడుగులు నడిచిన మనిషి, తనను ప్రేమించి పెళ్ళిచేసుకున్న మనిషి ఇంత తొందరగా తన చేయి విడిచి వేరొకరితో పాణిగ్రహణానికి సిద్ధపడతాడా', అలా ఆమె ఊహించలేకపోతోంది.

ఆరోజు రాత్రి అత్తయ్య, మావయ్యలిద్దరూ వారి ఊరికి ప్రయాణమయ్యారు. ఆమెకు చెప్పి వెళదామని వచ్చారు. గదిలో పడుకొని ఉంది సుజాత. ఏడ్చి, ఉబ్బిన కళ్ళు. ఉదయంనించీ స్నానం లేదు. భోజనం సయించలేదు. భర్త ఏదో ఎమర్జెన్సీకేసంటూ వెళ్ళిపోయాడు. సుజాత మరి ఆలోచించలేకపోయింది...

"సరే మీ ఇష్టం..." అంది చివరికి కన్నీటిని బలవంతంగా అణచుకొని.

❁ ❁ ❁

వారంరోజుల తర్వాత శశాంక రెండో పెళ్ళి తిరుపతిలో జరిగింది. వేరే ఇల్లు తీసుకుని అతను కాపురం పెట్టాడు. అప్పుడప్పుడు వస్తాడు. అతను పొడిపొడిగా మాట్లాడతాడు. ఆమె మూగ దానిలా వింటుంది.

నాలుగునెలల తర్వాత ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు శశాంక. పేరు అరుంధతి. అప్పుడు చూసింది ఆమెను సన్నగా పొడుగ్గా, ఛామన ఛాయ. ఎమ్మే చదివి లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తోందట! భర్త పక్కన ఆమెనుచూసిన సుజాతకు మరింత దిగులేసింది.

"ఆమెకు గర్భపరీక్ష చెయ్యాలి" అన్నాడు శశాంక.

ఆమెను పరీక్ష చేసే ముందే అనుకుంది, "భగవంతుడా ఈమె జీవితంలోనయినా వెలుగునివ్వు..." అని.

ఆమెకు పరీక్ష చేసి, గదిలోంచి నవ్వుతూ వచ్చిన సుజాత, "కంగ్రాచ్యులేషన్స్... అరుంధతి కన్సీవ్ అయ్యింది" అంది.

శశాంక ముఖంలో ఆనందం.

ఆరోజు నుంచీ శశాంక రాకపోకలు తగ్గాయి. రెండంతస్తులున్న ఆ పెద్ద ఇంట్లో సుజాత ఇపుడు ఒంటరిది.

❁ ❁ ❁

గంగకు తొమ్మిదో నెల. సుజాత అన్ని జాగ్రత్తలు తీసుకుంది. "పులిరాణికి ఎయిడ్స్ వస్తుందా!" అని వార్డులోని మిగతా డాక్టర్ల జోకులు, వేళాకోళాలు.

"దిక్కుమొక్కూ లేని ఆ ఎయిడ్స్ పేషంటుపై ఎందుకో అంత జాలి. పాపం మొగుడొదిలేసాడుగా."

ముఖంమీద, చాటుగా ఈటెల్లాంటి మాటలు. అన్నిటినీ సుజాత ఓపికగా భరించింది.

'ప్రాణానికి ప్రాణంగా భావించిన భర్తచేసిన గాయం ముందు ఇదెంత' అనుకుందామె.

❁ ❁ ❁

ఆరోజు రానే వచ్చింది. గంగకు సిజేరియన్ ఆపరేషన్ చెయ్యవలసిన రోజు. ఆమెలాంటి ఆలోచనలున్న ఇద్దరు డాక్టర్లు సహకరించారు. గైనకాలజిస్టుగా ఎంతో అనుభవమున్న తమ సర్వశక్తులు కేంద్రీకరించి ఆపరేషనులో తల మునకలయ్యింది.


గంటన్నర తర్వాత బిడ్డకెవ్వుమని అరిచింది.

'ఆడపిల్ల'- సుజాత హాయిగా ఊపిరి పీల్చుకుంది. అందరూ ఆమెకు అభినందనలు తెలిపారు.

(మిగతా 27వ పేజీలో)

# కొంటె రాజకీయ పార్టీలు

రాజకీయ వ్యవస్థలో బహుపార్టీ విధానం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ, ద్విపార్టీ విధానం అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఉంటాయి. అయితే అభివృద్ధి చెందిన దేశాల్లో కొన్ని పార్టీలు ఆవిర్భవించి, ఎన్నికల్లో తాము ఓడిపోతామని తెలిసినా పోటీ చేస్తుంటాయి. సరదాకోసం కొన్నయితే, ఓ అంశాన్ని ప్రజల దృష్టికి తేవడానికి మరికొన్ని ఇలా ఆవిర్భవిస్తుంటాయి.




కెనడాలోని 'ది రైనోసరస్ పార్టీ' ఆవిర్భావానికి కారణాలు భూమ్యాకర్షణ శక్తిని రద్దుచేయాలని, తమ మేనిటోబా ప్రావియెన్స్‌లో ప్రపంచంలోని అతి పెద్ద పార్కింగ్ లాట్‌ని నిర్మించాలని, హయ్యర్ ఎడ్యుకేషన్ స్కూళ్ళల్లో అతి పొడవైన భవంతులు నిర్మించాలని, కెనడాలోని చలిని నిషేధించాలని, తమ థౌజండ్ ఐలండ్స్‌ని లెక్కించి ఏవీ పోలేదని రూఢీ చేసుకోవాలని దీని డిమాండ్.

కెనడాలోనే 'ది అబ్సల్యూట్లీ అబ్సర్డ్ పార్టీ' ఆవిర్భావం కూడా జరిగింది. ఓటు హక్కు పద్నాలుగేళ్ళకి తగ్గించాలని, కారణం పద్నాలుగేళ్ళ పిల్లలు, ఇంతదాకా ప్రపంచంలో ఎక్కడా మరో దేశం మీదకి యుద్ధానికి వెళ్ళలేదు కాబట్టి పద్నాలుగేళ్ళ వాళ్ళని ప్రధానమంత్రిని చేయాలని వీరి డిమాండ్.

1993లో కమ్యూనిస్ట్ రష్యా కూలిపోయాక, బెలారస్ అనేచోట ఎన్నికల్లో 'బీర్ లవర్స్ పార్టీ' పోటీచేసింది. దాని చిహ్నం మత్తెక్కి నడిచే ముళ్ళ పంది. బీర్ తయారుచేసే బ్రూవరీస్‌లో శుభ్రత పాటించాలని బీర్ క్వాలిటీని పెంచాలని వీరి డిమాండ్.

డెన్మార్క్‌లో 1979లో కమెడియన్ జాకబ్ హగ్గర్డ్ ఓ పార్టీని స్థాపించాడు. మంచి వాతావరణాన్ని ఇస్తామని, క్రిస్టమస్‌కి ప్రజలు ఒకరికిఒకరు మెరుగైన బహుమతులు ఇచ్చుకునేలా చేస్తానని, ఉచితంగా బీర్, సాసేజెస్ ఇస్తామని, ఆర్మీ రేషన్స్‌లో న్యూటిలాని రెట్టింపు చేస్తామన్నవి వీరి వాగ్దానాలు. ఆశ్చర్యంగా హగ్గర్డ్ పార్లమెంట్ సీట్ గెలుచుకున్నాడు! సినీ కమెడియన్‌గా అతని మీద గల అభిమానం అతన్ని గెలిపించింది.

హంగేరీలో 2004లో 'డబుల్ టెయిల్డ్ డాగ్ పార్టీ' అనే పార్టీని స్థాపించారు. 2006 ఎన్నికల్లో అది ఈ వాగ్దానాలని చేసింది. మరణం కాని జీవితం, ప్రపంచ శాంతి, వారానికి ఒకరోజే పని, రోజుకి రెండు సూర్యాస్తమయాలు, ఉచిత బీర్, ప్రస్తుత టేక్సలని సగం చేయడం, న్యూజిలేండ్‌లోని 'మేక్ జెల్లీ కడ్లీ సీరియస్ పార్టీ' వాగ్దానాలివి. కాగితం కరెన్సీ స్థానంలో చాక్లెట్లని మారక ద్రవ్యంగా చేయడం, బీర్‌ని దేశ రక్షణకి ఉపాయంగా చేసి, తమ సముద్రపు తీరాల్లో చాలా బీర్ బాటిల్స్‌ని ఉంచడం ద్వారా, తమ దేశంమీద దాడిచేసిన విదేశీ సైనికులు వాటిని తాగి మత్తెక్కాక వారిని పట్టుకోవడం, మంచి వాతావరణం, జాతీయ రహదారులమీద కార్పెట్లని పరిచి ఉద్యోగాలని పెంచడం, గూఢచారులని ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకి పంపి, ప్రపంచ పటాల్లోని న్యూజిలేండ్‌ని చెరిపేయడం ద్వారా, విదేశస్థులు తమ దేశ ఉనికిని తెలుసుకుని దాడి చేయకుండా నివారించడం మొదలైనవి.

స్వీడన్‌లోని 'డొనాల్డ్ డక్ పార్టీ' 1991లో పేమెంట్లని వెడల్పు చేయడం, ప్రజలందరికీ లిక్కర్ ఉచితంగా ఇవ్వడంలాంటి వాగ్దానాలు చేసింది.

బ్రిటన్‌కి చెందిన 'ది హేపెనింగ్ హేపీ హిప్పీ పార్టీ' 1999లో బ్రిటన్ ద్వీపాన్ని దక్షిణంవైపు 200 మైళ్ళు జరిపి, చక్కటి వాతావరణాన్ని కలిగిస్తామని వాగ్దానం చేసింది.

అమెరికాలో 'ది మార్జువానా పార్టీ' తాము గెలిస్తే మార్జువానాకి లీగలైజ్ చేస్తామని వాగ్దానం చేసింది.

బెల్జియం భాషలో 'నీ' అంటే 'నో' అని అర్థం. 'నీ పార్టీ'ని స్థాపించిన పెద్దలు ఎన్నికల్లో నిలబడ్డవారిలో ఎవరూ మంచివారు లేకపోతే 'నో ఓన్' అనే బేలట్ కాగితాన్ని ఉపయోగించే అవకాశాన్ని కలిపిస్తామని ప్రకటించారు.

కెనడాలోని 'ది వర్కలెస్ పార్టీ' ఎంబ్లమ్ అలారంక్లాక్ ప్రతిరోజు పొద్దున్నే లేచి పనికి పరిగెత్తేవారికి ఈ పార్టీ రక్షణని ఇస్తుంది. వారానికి నలభై గంటల బదులు ముప్పైరెండు గంటలు లేదా ఇంకా తక్కువ గంటలకి, పనిగంటలని తగ్గించాలని దీని ఆదర్శం.

**- డి.పద్మజ**

---

(19వ పేజీ తరువాయి)

ఆపరేషను టేబులుమీదే పుట్టిన ఆ బిడ్డ బొడ్డునుంచి రక్తం తీసి పరీక్షకు పంపించింది.

అప్పుడు మొదలయ్యింది ఆమెలో అసలయిన టెన్షన్. 'ఇంత కష్టపడి... ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా హెచ్ ఐవి, పాజిటివ్ వస్తుందా...' ఇలా ఆమెలో ఆలోచనలు. మనసు మనసులో లేదు.

గంట తర్వాత ఆమెకు ఆనందం కలిగించే వార్త. పాపకు నెగిటివ్ రిజల్ట్. సుజాతకు ఆ వార్త అంతులేని ఆనందం కలిగించింది. మూడునెలల తర్వాత చెయ్యబోయే పరీక్షల్లోను ఆ జబ్బురాదు. అది నా నమ్మకం అనుకుంది సుజాత దృఢంగా.

వారంరోజుల తర్వాత గంగను, పాపను ఇంటికి తీసుకువచ్చేసింది సుజాత.

* * *

నాలుగు నెలల తర్వాత-

ఒక రోజు ఉదయం నిద్రలో ఉండగానే గుక్కపట్టి ఏడుస్తున్న పాప ఏడుపుతో గబగబా లేచింది సుజాత.

"గంగా...గంగా!" అంటూ అరిచింది. పాపను ఒళ్ళోకి తీసుకుని పాలసీసా నోట్లో ఉంచింది. ఇంతలో వంటమనిషి వచ్చి "అమ్మా...గంగ మీకు ఈ ఉత్తరం ఇమ్మని చెప్పి వెళ్ళిపోయింది. తన బట్టల సంచీ తీసుకుని" అంది. కంగారుగా ఉత్తరం తీసి చదవడం మొదలుపెట్టింది సుజాత.

అమ్మా!

మిమ్మల్ని ఎలా పిలిచినా తక్కువే, అందరికంటే గొప్పదైన అమ్మతో మిమ్మల్ని పోల్చి అమ్మా అని పిలవాలనిపించింది. నా బిడ్డకు ఈ మహమ్మారి జబ్బురాకుండా కాపాడినందుకు ఎన్ని జన్మలెత్తి మీ ఋణం తీర్చుకోలను? నేను మీ ఇంట్లో వుంటే భవిష్యత్తులో మీకు సమస్యలు, అందుకే నేను వెళ్ళిపోతున్నాను, అందరు తల్లులకు ఉండే స్వార్థం నాకూ ఉంది. అందుకే నా బిడ్డ క్షేమంగా, సురక్షితంగా ఉంటుందని మీ దగ్గరే వదిలి వెళుతున్నాను. నేను చచ్చిపోనమ్మా. తల్లిలాంటి మీరు నాపైన, నా బిడ్డపైన చూపిస్తున్న ప్రేమను గుండెల్లో దాచుకుని ఊపిరి ఉన్నంతకాలం ఆనందంగా బతుకుతాను. మరో జన్మంటూ వుంటే మీకు కూతురిగా పుట్టాలని కోరుకుంటూ,

మీ

గంగ.

సుజాత ఆ ఉత్తరం చదివి భారంగా నిట్టూర్చింది. 'గంగను, పాపను ఇంటికి తీసుకువచ్చిన తర్వాత శశాంకకు తనకు వాదోపవాదాలు జరిగాయి. అతను పూర్తిగా రావడం తగ్గించాడు. గంగ వెళ్ళిపోతే నా సమస్య తీరుతుందా, రెండో పెళ్ళిచేసుకున్న నా భర్త నాతో కలిసి ఉంటాడా, అంతా భ్రమ, గంగ అనవసరంగా వెళ్ళిపోయింది' అనుకుంటూ సుజాత బాధగా కళ్ళు మూసుకుంది.

అంతలో మెత్తటి స్పర్శ ఆమె శరీరాన్ని తాకింది. ఆ స్పర్శ ఆమె హృదయాన్ని గిలిగింతలు పెట్టింది. బలంగా తన చేతిని పట్టుకున్న లేత వేళ్ళు.

'ఔను... నేను ఒంటరిదాన్ని కాను. నాకో తోడు దొరికింది,' అనుకుంటూ తృప్తిగా పాపాయి తల నిమిరింది సుజాత.

★

రచయిత చిరునామా:

డాక్టర్ ఎమ్.సుగుణరావు,

38-16-4,

మాధవధార, విశాఖపట్నం- 530 007.